# రోడ్డంతా కంపు కంపు

- వరదలా పారుతున్న డ్రైనేజీ నీరు
- 20 రోజులైనా పట్టించుకోని అధికారులు..
- మురుగులో గేదెల తిష్ట.. ఇబ్బందుల్లో ప్రజలు



లూనోట్ విల్లాస్ వద్ద వరదలా ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు.. సేద తీరుతున్న గేదెలు

బండ్లగూడ, జూన్ 22: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకుపోతున్నా ఫలితం లేకుండా పోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఓయాసిస్ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న డ్రైనేజీ గత 20రోజులుగా పొంగి ఏరులా ప్రవహిస్తున్నది. దీంతో ఆ రోడ్డు గుండా డ్రైనేజీ నీరు వరదలా రావడంతో లూనోట్ విల్లాస్, ఓయాసిస్ అపార్ట్‌మెంట్, శ్రీలేఖ తదితర కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో దుర్గంధాన్ని వెదజల్లుతున్నది. తద్వారా ప్రజలు అనేక అంటు రోగాల బారినపడే అవకాశం ఉందని స్థానిక కాలనీల ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో గేదెలు సైతం అక్కడే తిష్టవేస్తున్నాయి. డ్రైనేజీ నీరుతో అసలే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే గేదెలతో మరింత తలనొప్పిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**కమిషనర్‌కు వినతిపత్రం**

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓయాసిస్ వద్ద పొంగి పొర్లుతున్న డ్రైనేజీ నీటితో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు శనివారం కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఆయన నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు. కాగా, నెల రోజుల వరకు తమ పరిస్థితి ఏంటి.. అనేదే ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. కనీసం అక్కడ నిలబడే పరిస్థితి కూడా లేనపుడు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు ఇలా సమాధానం ఇవ్వడం ఏమిటని ఆశ్చర్యానికి గురయ్యారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

హిమాయత్ నగర్, జూన్ 22: రాష్ట్రంలోని బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టీ. వెంకట్రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. ఈనెల 25న హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగే బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు అంశాలను చర్చిస్తామని వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు బకాయిలు ఉన్న అన్ని రకాల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## బీసీ కులాలకు ప్రత్యేక మీడియా వ్యవస్థ అవసరం



అభివాదం చేస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, మందకృష్ణ, చిరంజీవులు, వకులాభరణం తదితరులు

ఖైరతాబాద్, జూన్ 22: బీసీ కులాలకు మీడియా వ్యవస్థ ఉంటే వారిగళాన్ని వినిపించే అవకాశం ఉంటుందని రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. జర్నలిస్ట్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షులు నీలం వెంకన్న అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రధాన మీడియా వ్యవస్థలు అగ్రకులాల చేతుల్లో ఉందని, బీసీ కులాలకు ప్రత్యేక మీడియా వ్యవస్థ అవసరముందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుటు టి. చిరంజీవులు, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, జర్నలిస్ట్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌కృష్ణయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోర శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## సంఘ సేవకులు శ్రీనివాస్ రెడ్డికి సన్మానం

ఎర్రగడ్డ, జూన్ 22: ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన సంఘ సేవకులు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డికి అమెరికన్ యూనివర్సిటీ వారు ఇటీవల గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కల్యాణ్‌నగర్ వెంచర్-3 కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. సంఘం అధ్యక్షుడు నరసింహారావు, సుబ్రమణ్యం రాజు, లయన్ రాజశేఖర్, వీరరాఘవ చౌదరి, పరకాల మీనా, వీరేందర్ రెడ్డి, పొలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ఆగడాలు అరికట్టాలి

**బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గౌస్‌పాషా**



గౌస్‌పాషా

శంషాబాద్ రూరల్, జూన్ 22: శంషాబాద్‌లో ట్రాఫిక్ పోలీసుల ఆగడాలను అరికట్టాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గౌస్‌పాషా ఆదివారం పేర్కొన్నారు. శంషాబాద్ పట్టణంలో ప్రతిరోజు కూరగాయల మార్కెట్‌కు వేలాది మంది రైతులు, కొనుగోలు దారులు వస్తుంటారు. మార్కెట్ వద్ద కనీసం పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపుల కేవలం తెల్లవారుజామున 8 గంటల వరకు పెట్టుకుంటున్నారు. జాతీయ రహదారిలో బ్రిడ్జి ఉండటంతో కింద ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఉండదని తెలిపారు. పోలీసులు రైతుల వాహనాలకు వేలాది రూపాయలు ఫైన్‌వేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కూరగాయల మార్కెట్‌కు వచ్చే రైతులు ఆరుగాలం కష్టపడి మార్కెట్‌కు వస్తే వారికి కేవలం రూ.500 నుంచి రూ.వెయ్యి వస్తాయి. ట్రాఫిక్ పోలీసులు విధిస్తున్న జరిమానాలకే సరిపోతుందని వివరించారు. కూరగాయాల మార్కెట్‌కు వచ్చే రైతులు, కొనుగోలు దారులకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. శంషాబాద్ పట్టణంలోని జాతీయ రహదారితో పాటు రాళ్లగూడ రోడ్డులో దుకాణాల ఎదురుగా వాహనలు పెడితే జరిమాన విధిస్తున్న పోలీసులు దుకాణాదారులు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకపోయిన వారిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. శంషాబాద్ పట్టణంలో ద్విచక్ర వాహనదారుల ఇబ్బందులపై పోలీసులను కలిసి చర్చించగా ఏసీపీ, సీఐ స్థాయి అధికారులు ఎలాంటి ఇబ్బందులకు గురిచేయడంలేదు. కాని కిందిస్థాయి సిబ్బంది మాత్రం ప్రజలను, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## పుస్తకాల ఆవిష్కరణ



అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వెలువరించిన భూతనాథోపాఖ్యానం, శబరిమల సంపూర్ణ చరిత్రమాల, నియమాల నిష్ట పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మహాసహస్రవదాని, ప్రవచనకర్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు కనపర్తి విఘ్నేష్, శ్రీనివాస్, పందలం ప్యాలెస్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షులు శంకర్ వర్మ, శబరిమల గురుత్తి పూజా నిర్వాహకులు అజిత్ కుమార్, తిరు ఆభరణాల సేవకర్తలు శివంకుట్టి ఉన్ని కృష్ణ, వినోద్ కుమార్, ప్రతాప చంద్రతో కలిసి ఆవిష్కరించారు. – ఖైరతాబాద్, జూన్ 22

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 22: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామిలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఆదివారం శంషాబాద్ మండల సీపీఐ మహాసభ స్థానిక మహిళా మండలి భవనంలో నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైయిందన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయడంతోపాటు ముఖ్యంగా ఔటర్‌రింగ్ రోడ్డు చుట్టు పక్కల గ్రామాల రైతులకు వెంటనే రైతుభరోసా ఇవ్వాలన్నారు. లేనిచో సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, కల్యాణలక్ష్మిలో లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి, మండల కార్యదర్శి నర్రగిరి, అన్నేపు ప్రభుముదిరాజ్, జిలకరాజు, నరేశ్ నాయక్, వెంకటేశ్‌లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా నర్రగిరి, సహాయ కార్యదర్శిగా అన్నేపు ప్రభుతోపాటు 15మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

## మాగంటి చొరవతో దీర్ఘకాలిక సమస్యలు మాయం

**హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశంలో వక్తలు**



మౌనం పాటించి మాగంటికి సొసైటీ పాలక మండలి ప్రతినిధుల శ్రద్ధాంజలి

ఎర్రగడ్డ, జూన్ 22: ప్రజలతో మమేకమై అభివృద్ధికి పాటు పడిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ లేని లోటు తీరనిదని ఎన్ఆర్ఆర్‌పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పాలక మండలి ప్రతినిధులు పేర్కొన్నారు. సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం బోరబండ ప్రొఫెసర్ జయశంకర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు షేక్ యూసుఫుద్దీన్ మాట్లాడుతూ.. సొసైటీలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్ అంశం ఎమ్మెల్యే మాగంటి చొరవతో కార్యరూపం దాల్చిందన్నారు. సుమారు 2400మంది సభ్యులున్న ఎన్ఆర్ఆర్‌పురం హౌసింగ్ సొసైటీలో కొంత మందికి ఇండ్ల స్థలాలు కేటాయించాల్సి ఉందన్నారు. ఇందు కోసం కావాల్సిన ఎకరం స్థలాన్ని సమకూర్చుడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, సభ్యుల సహకారం అవసరమని వివరించారు. అంతకు ముందు హాజరైన సభ్యులందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి మాగంటికి శ్రద్ధాంజలి ఘటించారు. సమావేశానికి సహకార శాఖ అధికారి బి.వి నోద్ పారిశీలకులుగా విచ్చేశారు. సొసైటీ కార్యదర్శి ఇమామ్ ఘోరీ, ఉపాధ్యక్షుడు ఈలయ్య, కోశాధికారి సత్యనారాయణ, మేనేజింగ్ కమిటీ, సూపర్ వైజరీ కౌన్సిల్ ప్రతినిధులు అక్తర్ సుల్తానా, అమృత, రామ్మోహన్‌రావు, అహ్మద్ అలీ, సత్తాజీ, సాయినాథ్‌రావు, ఎంఏ రహ్మాన్, దేవరాజ్, కలీముద్దీన్, వేణుగోపాల్ సింగ్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.




## జూబ్లీహిల్స్‌లో ఏటీఎఫ్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

బంజారాహిల్స్,జూన్ 22: అసియన్ టెన్నిస్ ఫెడరేషన్(ఏటీఎఫ్)ఆధ్వర్యంలో దక్షిణాసియా గ్రేడ్ ఏ టెన్నిస్ పోటీలను మంత్రి వాకిటి శ్రీహరి ఆదివారం జూబ్లీహిల్స్‌లోని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రారంభించారు. భారత్‌తో పాటు అమెరికా, థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేషియా, ఉజ్బెకిస్తాన్, న్యూజిలాండ్ సహా 16 దేశాల నుంచి వర్ధమాన టెన్నిస్ క్రీడాకారులు అండర్-14 కేటగిరిలో తలపడనున్నారు. జూన్ 29వరకు టోర్నమెంట్ కొనసాగుతుందని, ఆసియా టాప్-10 క్రీడాకారులు సైతం ఈ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం యువత తమ సమయాన్ని వృధా చేస్తున్నారని, క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు ఏపీ.జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వర్‌రావు, ప్రవీణ్ రెడ్డి, రామకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

వెంగళరావునగర్, జూన్ 22:అనుమానాస్పద స్థితిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఎస్సార్నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలానికి చెందిన విష్ణు(26)నగరంలోని ఇన్ఫోసిస్ సంస్థలో ఉద్యోగి. ఎస్సార్నగర్ సమీపంలోని తన దగ్గరి బంధువు నిర్వహిస్తున్న లావిస్ రెడీమెడ్ క్లాత్ షోరూమ్‌కు ఆదివారం వచ్చాడు. షోరూంలో మద్యం తాగుతూ కూర్చున్న విష్ణు సాయంత్రం 8 గంటలకు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో స్థానికులు బాధితుడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా ఎస్సారనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ముగిసిన బడిబాట

జూబ్లీహిల్స్,జూన్ 22:ప్రభుత్వ పాఠశాలల్లో గత పక్షం రోజులుగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ముగిసింది. నూతన విద్యా సంవత్సరం (2025-26)లో చేపట్టిన బడిబాట క్యాంపెయిన్‌లో ఖైరతాబాద్ జోన్‌లో 2411 అడ్మిషన్లు వచ్చాయి. ఖైరతాబాద్-1 మండలంలో 1 వ తరగతిలో 173 మంది కొత్త విద్యార్థులను చేర్చుకోగా.. మొత్తం 527 అడ్మిషన్లు వచ్చాయి. షేక్‌పేట్ మండలంలో 1వ తరగతిలో 340 మంది కొత్త విద్యార్థులను చేర్చుకోగా.. మొత్తం 520 అడ్మిషన్లు వచ్చాయి. ఖైరతాబాద్-2 మండలంలో 1 నుంచి 5 తరగతులకు 767అడ్మిషన్లు.. 6 నుంచి 10 తరగతులకు 607 అడ్మిషన్లు వచ్చాయని డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. అన్ని పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తుండగా.. ఈ ఏడాది కొత్తగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా నోట్ పుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లోని హనుమాన్ స్టోన్ కట్టర్స్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రామ్‌కుమార్‌తో కలిసి అక్షరాభ్యాసం చేయించారు.

**అడ్మిషన్లు కొనసాగుతాయి..: శామ్యూల్ రాజ్, డిప్యూటీ డీఈఓ**

ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం ముగిసింది. అయితే అడ్మిషన్లు నిరంతరం కొనసాగుతుంటాయి. బడిఈడు పిల్లలు బడి బయట ఉండకుండా పాఠశాలల్లో చేర్పించండి. ఇది అందరి బాధ్యత. డ్రాపవుట్స్ గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం నిరంతర ప్రక్రియ.. బడీడు పిల్లలు బడి బయట ఉంటే స్థానిక పాఠశాలలకు వెంటనే సమాచారం ఇవ్వాలి.

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా '5కే రన్'

ఖైరతాబాద్, జూన్ 22: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్లో 5కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ట్రస్ట్ చైర్మన్, విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ సయ్యద్ ఉమర్ అలీ షా జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణ పరిక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రొగ్రామ్ కన్వీనర్ సూర్యలత మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగేండ్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యువతీ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




రన్‌లో పాల్గొన్న యువతీ యువకులు

## ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల అరెస్ట్



ఆందోళన చేస్తున్న ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

బంజారాహిల్స్,జూన్ 22: బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మీడియా సమావేశం పెట్టేందుకు వస్తున్నాడన్న సమాచారంతో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఎన్ఎస్‌యూఐకి చెందిన కార్యకర్తలు ఆందోళనకు దిగేందుకు యత్నించారు. తెలంగాణ భవన్ వద్దకు వచ్చిన 11మంది ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించిన వారిని పోలీసులు అరెస్ట్ చేసి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఈఈ ఇందిరాబాయి

జూబ్లీహిల్స్, జూన్ 22: జీహెచ్‌ఎంసీ-19వ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఆర్.ఇందిరాబాయి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఈఈ యూ.రాజ్ కుమార్ స్థానంలో చందానగర్ సర్కిల్ ఈఈగా ఉన్న ఆమె యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. కాగా, కొత్తగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రహ్మత్‌నగర్, బోరబండ వార్డుల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి వరద నీటి పైప్‌లైన్ పనులను, రోడ్డు పనులను పరిశీలించారు. స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు 100శాతం పూర్తి చేసిన అనంతరం రోడ్డు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్‌గూడ సర్కిల్ ఏఈ భరత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పాక రమేశ్‌కు ఉత్తమ సేవా పురస్కారం



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న రమేశ్

హిమాయత్‌నగర్, జూన్ 22: తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మంత్రి దామోదర్ రాజనర్సింహ కార్యాలయంలో ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్న పాక రమేశ్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్ డాక్టర్ జి.వెన్నెల, తెలంగాణ ఫిలిం చాంబర్ చైర్మన్ పి. రామకృష్ణగౌడ్ చేతులమీదుగా పాక రమేశ్ పురస్కారం అందుకున్నారు. పాక రమేశ్ మాట్లాడుతూ.. సేవా పురస్కారంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని, ప్రభుత్వ ఉద్యోగుల్లో సామాజిక బాధ్యతను పెంచేందుకు తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న పాక రమేశ్‌ను ఉద్యోగ సంఘాల నేతలు, రెవెన్యూ ఉద్యోగులు అభినందించారు.

## టౌన్ ప్లానింగ్‌లో తరచూ ఏసీపీల బదిలీ

- శేరిలింగంపల్లికి బదిలీపై వచ్చిన అధికారికి ఇంచార్జ్ బాధ్యతలు
- సమీపంలో అసెంబ్లీ ఎన్నికలు..
- పట్టణ ప్రణాళిక విభాగంలో సిబ్బంది కొరత..

జూబ్లీహిల్స్,జూన్ 22: యూసుఫ్‌గూడ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అనిశ్చితి కొనసాగుతున్నది. తరచుగా ఏసీపీల బదిలీలు చోటు చేసుకుంటుండగా గత అక్టోబర్‌లో న్యాక్ ఇంజినీర్, చైన్‌మెన్ బదిలీలు జరిగాయి. అదే సమయంలో వచ్చిన సెక్షన్ ఆఫీసర్ సైతం తాజాగా బల్దియా కమిషనర్ చేపట్టిన ప్రక్షాళనలో సర్కిల్-10 ఫలక్‌నుమాకు బదిలీ అయ్యారు. అయితే ఇప్పటికే ఒకే ఒక్క సెక్షన్ ఆఫీసర్‌తో కొనసాగుతున్న 19వ సర్కిల్‌లో ఉన్న అధికారిని బదిలీ చేసి పూర్తిస్థాయి అధికారిని నియామకం చేపట్టకపోవడం గమనార్హం. హయత్‌నగర్ సర్కిల్ నుంచి శేరిలింగంపల్లి సర్కిల్‌కు బదిలీ అయిన ఎం.డీ. అక్బర్ అహ్మద్‌కు యూసుఫ్‌గూడ 19వ సర్కిల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చారు. కొత్త సర్కిల్‌కు కొత్తగా వచ్చిన సదరు అధికారి జోనల్ కేంద్రమైన శేరిలింగంపల్లి ఎస్ఓగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే యూసుఫ్‌గూడ సర్కిల్‌కు అదనపు బాధ్యతలు చేపట్టడం కష్టసాధ్యంగా మారనున్నది. టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసీద కూడా ఇటీవలే ఈ సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. అప్పటికే ఏసీపీలుగా ఇక్కడకు వచ్చిన పావని, కృష్ణవేణిలు స్వల్పకాల వ్యవధిలో బదిలీలపై వెళ్లిపోయారు.

ఒక న్యాక్ ఇంజినీర్ స్థానంలో వచ్చిన ఇద్దరు న్యాక్ ఏఈలలో అనారోగ్య కారణాలతో ఒకరు నిష్క్రమించారు. పేరుకే ఉన్న ఒక చైన్ మెన్ కూడా సుదీర్ఘకాలంగా అనారోగ్య పరిస్థితుల్లో ఆఫీస్ అటెండర్ పనులకే పరిమితం అవుతున్నాడు. దీంతో కమిషనర్, జోనల్ కమిషనర్, చీఫ్ సిటీ ప్లానర్ లతో ప్రతినిత్యం సమావేశాలతో తలమునకలయ్యే ఏసీపీ స్థాయి అధికారికి సర్కిల్ వ్యవహారాలు చూసే సిబ్బంది కరువయ్యారు. అయితే జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల సర్వే ముమ్మరంగా చేపడుతున్న అధికారులకు మున్ముందు సిబ్బందికి కొరత సమస్యగా మారనుంది. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు పట్టణ ప్రణాళిక విభాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్న వాదన వినవస్తుంది. ఈ విషయంపై టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసీద మాట్లాడుతూ.. బదిలీ అయిన సెక్షన్ ఆఫీసర్ స్థానంలో కొత్త ఎస్ఓ నియామకం జరిగినట్లు తెలిపారు. సిబ్బంది కొరతపై సమాచారం ఇవ్వడానికి నిరాకరించారు.

## ఆలయం గేటు పేరుతో 'డబుల్' ఇండ్ల స్థలంపై కన్ను

- అధికారపార్టీ నేతల తీరుపై స్థానికుల ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ డిమాండ్



దీన్‌దయాళ్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల స్థలంలో కొత్తగా ఏర్పాటు చేసిన గేటు

బంజారాహిల్స్,జూన్ 22: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దీన్ దయాళ్‌నగర్‌లో గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని అధికార పార్టీ నేతలు ఆక్రమించేందుకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు. వినాయక్‌నగర్ పర్వతాంజనేయ స్వామి ఆలయానికి గేటు ఏర్పాటు చేస్తున్నామన్న నెపంతో ఖరీదైన స్థలంపై కన్నేశారు. దీన్‌దయాళ్‌నగర్ బస్తీ, వినాయక్‌నగర్ బస్తీ మధ్యన సుమారు 2 ఎకరాల స్థలాన్ని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం కేటాయించింది. అయితే ఇండ్ల నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో స్థలం ఖాళీగా ఉన్నది. కాగా, ఈ స్థలం పక్క నుంచి పర్వతాంజనేయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు ఉన్నది. రోడ్డు పక్కన సుమారు 10 ఇండ్లు ఉన్నాయి. అయితే గత కొంతకాలంగా ఆలయం పేరుతో స్థలాన్ని ఆక్రమించేందుకు బస్తీకి చెందిన కొంతమంది అధికారపార్టీ నేతలు సరికొత్త స్కెచ్‌కు తెరతీశారు. ఆదివారం నాడు ఆలయానికి వెళ్లేరోడ్డుపై సుమారు 150 మీటర్ల దూరంలోనే గేటు ఏర్పాటు చేశారు. గేటు లోపల ఉండే ఇండ్లకు దారిలేకుండా చేయడంతో పాటు గేటు లోపల స్థలాన్ని ప్లాట్లుగా వేసి అమ్ముకోవాలన్న కుట్రలకు తెరలేపారని, గుడి గేటు పేరుతో జనం మధ్యన గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే షేక్‌పేట రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమంగా ఏర్పాటు చేసిన గేటును తొలగించాలని డిమాండ్ చేశారు.

## ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపాలి

**సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెలపల్లి శ్రీనివాసరావు**



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 22: ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి మావోయిస్టుతో శాంతిచర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెలపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలోని ఎలైట్ హోటల్‌లో జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ..మధ్య భారతంలో మావోయిస్టుపై దారుణమైన హింసాకాండ కొనసాగించడం, భారీ ఎత్తున బలగాలను మొహరించి వారిని హతమార్చాలని కుట్రను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మావోయిస్టులు లేకుండా చేయడమే తమ ఎజెండగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. దేశాభివృద్ధికి కాకుండా కేవలం అమాయక గిరిజన, అడవి బిడ్డలను చంపేయడం ఏమిటని నిలదీశారు. రాష్ట్రంలో కార్పోరేట్ విద్యాసంస్థలు కాన్వెంట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూల్ చేసి విద్యా సంస్థలను వ్యాపార కేంద్రాలుగా మార్చడం దారుణమని మండిపడ్డారు. విద్యను అంగట్లో సరుకులాగా మార్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికఫీజులు వసూల్ చేస్తున్న పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.